క్లుప్తంగా

మూలస్థానేశ్వరునికి రేపటి నుంచి వసంతోత్సవాలు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శ్రీభువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో వైశాఖ మాసం సందర్భంగా ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు వసంతోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.వేణుగోపాల్ శుక్రవారం తెలిపారు. అలాగే 12వ తేదీన జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు జరుగుతాయని తెలిపారు. వసంతోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ అలంకారోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

కరపత్రాల పంపిణీ

నెల్లూరు(బృందావనం): మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్స్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటూ శుక్రవారం నెల్లూరు నగరంలో కరపత్రాలను పంపిణీ చేసినట్లు ఆ సంస్థ అధ్యక్షుడు ఎస్.మస్తానయ్య తెలిపారు. ఓటుకు నోటు వద్దు–నిజాయతీ ముద్దు.. సేవ్ డెమోక్రసీ అంటూ ప్రచారం చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. మద్యం, నగదు తదితర ప్రలోభాలకు గురికాకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్.అనిల్, నవీన్, సుమన్, రమణయ్య పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ



నెల్లూరు(బృందావనం): నగరంలోని పడారుపల్లి ఆచార్య పీసీరెడ్డి సమాజ మందిరంలో కావలిరెడ్డి మల్లికార్జునరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని భార్య మాలతి సౌజన్యంతో క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగులు, పేదలకు శుక్రవారం ఆహార పొట్లాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపీనాథ్‌రెడ్డి, శారద, రాజ్యలక్ష్మి, గుమ్మడి రాజగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదాల గెలుపు ఖాయం



ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి గెలుపు ఖాయమని ఆ పార్టీ నాయకురాలు కల్లూరు లక్ష్మీరెడ్డి తెలిపారు. రూరల్ నియోజకవర్గంలోని 24వ డివిజన్ కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అనితరెడ్డి, నరసింహారెడ్డి, ఆదిత్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి రావాలి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న స్వర్ణ వెంకయ్య తదితరులు

నెల్లూరు సిటీ: రాష్ట్రంలో దళిత వర్గాలు వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి రావాలని కోరుకుంటున్నాయని, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని పట్టుదలతో ఉన్నాయని రైల్వేబోర్డు సభ్యుడు, దళిత నేత స్వర్ణ వెంకయ్య పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గంలోని అరుంధతీయవాడ, వడ్డిపాళెం, బీసీ కాలనీల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఉదయగిరి నరసింహాగౌడ్, రాష్ట్ర బీసీ నాయకులు పాల్వ శ్రీనివాసులు, వెంకట్రావు, ఆనంద్, రమణమ్మ, సుధాకర్, ఆదిశేషరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడాకారుడికి ఆర్థిక సాయం

ఆత్మకూరు : పట్టణానికి చెందిన జాతీయ క్రీడాకారుడు పి.సాయికిరణ్‌కు స్థానిక వైఎస్సార్‌సీపీ నేత శుక్రవారం ఆర్థికసాయం అందించారు. సాయికిరణ్ పెన్‌కాక్ సిలాట్ నేషనల్ రిఫరీ అండ్ జ్యూరీ కోర్సుకు ఎంపికయ్యాడు. ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు జమ్ముకాశ్మీర్‌లోని శ్రీనగర్ ఇండోర్ స్టేడియంలో ఈ క్రీడలు జరగనున్నాయి. కాగా అతని ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జె.ప్రణీత్ రూ.15 వేల ఆర్థిక సాయాన్ని ఆయన కార్యాలయంలో అందజేశారు. ట్రస్ట్ సభ్యులు సందీప్, కుమార్, యాసీన్, టి.అశోక్, వెంకీ, రాజు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీదే విజయం

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి



వాక్ విత్ వీఎస్‌ఆర్ కార్యక్రమంలో ప్రజలకు అభివాదం చేస్తున్న వేణుంబాక విజయసాయిరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయమని స్వయంగా బీజేపీ నాయకులే చంద్రబాబుకు తెలియజేశారని, టీడీపీ, జనసేన, బీజేపీ ఓటమిని వారే అంగీకరించారని, తద్వారా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కాబోతున్నారని వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి తెలిపారు. నెల్లూరు నగరంలో విజయసాయిరెడ్డి శుక్రవారం నిర్వహించిన 'వాక్ విత్ వీఎస్‌ఆర్' కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీఆర్సీ సెంటర్ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం బారకాసు మీదుగా ములుముడిబస్టాండ్, లస్సీసెంటర్ మీదుగా గాంధీబొమ్మ సెంటర్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ప్రజలు ఆయనకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. విజయసాయిరెడ్డితోపాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్, విజయసాయిరెడ్డి సతీమణి సునందరెడ్డి, కుమార్తె నేహారెడ్డి, పార్టీ శ్రేణులు ప్రజల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీల అంచనా ప్రకారం వైఎస్సార్‌సీపీకి 120 స్థానాలు వస్తాయని వారే అన్నారని, దీంతో చంద్రబాబునాయుడు అసహనానికి గురై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నానా మాటలు మాట్లాడుతున్నారని, అంతేకాక హత్యాయత్నాలు చేయిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రిపై హత్యాయత్నం, హోంమంత్రి తానేటి వనిత ఇంటిపై దాడి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆర్.కృష్ణయ్యలపై దాడులు ఇందుకు నిదర్శనమని, ఈ ఘటనలు చంద్రబాబు మానసిక స్థితిని తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. చంద్రబాబు వివిధ దేశాల్లో, ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన వారు, తన బంధువుల వద్ద పొలిటికల్ కాంట్రిబ్యూషన్ పేరుతో దాదాపు రూ.10 వేల కోట్లు తీసుకుని నెల్లూరు జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో పంచుతున్నారని తెలిపారు. తనకు కావాల్సిన వారికి ఓటుకు రూ.9 వేలు ఇస్తూ, దళితులకు, పేదలకు ఓటుకు రూ.2 వేల నుంచి రూ.3 వేల మాత్రమే ఇస్తున్నారని చంద్రబాబుపై ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. చట్టవిరుద్ధమైన ఈ కార్యకలాపాలకు చంద్రబాబు తప్పక బాధ్యుడవుతారని తెలిపారు. కుల ప్రాతిపదికన ఓటుకు రేటు నిర్ణయించడం తొలిసారిగా చూస్తున్నానన్నారు. ఆయనకు తోడు రామోజీరావు, రాధాకృష్ణ జోడై ప్రజాస్వామ్య మూలస్తంభాలను కూలగొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నెల్లూరు నగర అభ్యర్థి పొంగూరు నారాయణ మూడు నెలల క్రితం 30 వేల మెజారిటీతో గెలుస్తానని చెప్పారని, ప్రస్తుతం ఓటమి ఖాయమని తెలిసి దిక్కుతోచని స్థితిలో ఉన్నారని తెలిపారు. నెల్లూరు పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని విజయసాయిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్ భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించి విజయోత్సవ సభలో మళ్లీ కలుద్దామని తెలిపారు.

టీడీపీలో డబ్బున్న వారికే టికెట్లు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి అన్ని వర్గాల ప్రజలు అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో టీడీపీ డబ్బులున్న వారికే టికెట్లు ఇచ్చిందని, డబ్బులతో వారు చేసే అకృత్యాలు, కులాన్ని బట్టి ఓటుకు డబ్బు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. ఏ కులం ఓటుకు ఎంత రేటు ఇస్తున్నారో అందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. త్వరలో వాటిని విడుదల చేస్తామని తెలిపారు. కులతత్వ పార్టీ అని ముద్రపడిన టీడీపీ మరోసారి తన బుద్ధి బైటపెట్టుకుందన్నారు. తెలంగాణ, రాయలసీమల నుంచి టీడీపీ నెల్లూరు నగర అభ్యర్థి పొంగూరు నారాయణ 1,400 మందిని నెల్లూరు నగరానికి తీసుకొచ్చారని, వారితో డబ్బులు పంపిణీ చేయిస్తున్నారని తెలిపారు. వీరిలో కొంత మంది సంఘవిద్రోహశక్తులు ఉన్నారని తెలుస్తోందన్నారు. ఈ విషయంపై తామిప్పటికే ఫిర్యాదు చేశామన్నారు. ఇలాంటి విధ్వంసకరశక్తులను వైఎస్సార్‌సీపీ కచ్చితంగా అడ్డుకుంటుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని అన్ని అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలు కైవసం చేసుకుంటుందని తెలిపారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ ప్రత్యర్థి పార్టీలు ఎంత డబ్బులు పంచినా వైఎస్సార్‌సీపీనే ప్రజలు గెలిపిస్తారన్నారు. మనుక్రాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని, ప్రజలకు మంచి చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే మళ్లీ ముఖ్యమంత్రి పీఠం అందిస్తారని తెలిపారు. ఉత్సాహంగా సాగిన 'వాక్ విత్ వీఎస్‌ఆర్' కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లిం కుటుంబాలు



వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లిం నాయకులతో ఆనం జయకుమార్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆనం జయకుమార్‌రెడ్డి సమక్షంలో పలు ముస్లిం కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. నగరంలోని 42వ డివిజన్‌లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డివిజన్ పరిధిలో ముస్లిం కుటుంబాలు స్థానిక కార్పొరేటర్ కరిముల్లా ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి నాయకులు పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆనం జయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పాలన, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లుగా సుపరిపాలన అందించారని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుంటే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్‌లకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి సంక్షేమం వైపు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని సజ్జాపురం గ్రామంలో టీడీపీకి చెందిన 10 కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఆనం విజయకుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. 12వ డివిజన్‌లోని జెడ్పీ చైర్‌పర్సన్ నివాసంలో పార్టీలో చేరిన వారికి నేతలు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గుంజి పోలయ్య, శ్రీహరి, రమేష్, గుంజి, గురునాథం శీనయ్య, అనిల్, ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నాయకుడు హంసకుమార్‌రెడ్డి, ఎంపీపీ బూడిద విజయ్‌కుమార్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పుచ్చలపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు చేరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి హరిశివారెడ్డి, వేమిరెడ్డి హరికృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించి ప్రచారం చేస్తే చర్యలు

- గడువు అనంతరం ప్రచారాలపై నిఘా ఉంచండి
- పోలీస్ అధికారులకు సూచించిన ఆర్‌ఓ వికాస్‌మర్మత్



అధికారులతో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలు ఉల్లంఘించి ప్రచారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని నెల్లూరు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్ పేర్కొన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో శుక్రవారం పోలీస్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్‌మర్మత్ మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఎన్నికల ప్రచారాలకు అనుమతి ఉందన్నారు. గడువు ముగిసిన తరువాత నుంచి నియోజకవర్గ పరిధిలో ఎక్కడైనా ప్రచారాలు జరుగుతున్నాయేమోనని ఆయా ప్రాంతాల్లో పోలీసులు నిఘా ఉంచాలని తెలిపారు. 12వ తేదీన చేసే ప్రచారం ఏమాత్రం ఆర్భాటం లేకుండా కేవలం అభ్యర్థి తనతోపాటు మరో ముగ్గురితో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటరుకు నమస్కారం చేసుకుంటూ వెళ్లాలన్నారు. అలాకాకుండా అధిక మందితో కలిసి ప్రచారం చేయడం, సభలు నిర్వహించడం, మైకుల ద్వారా ప్రచారం చేయడంపై దృష్టి సారించాలని పోలీస్ అధికారులకు సూచించారు. అలా ఎక్కడైనా జరుగుతుంటే వెంటనే వాటిని అడ్డుకుని ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ఓటింగ్ జరిగేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పారపాటున ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు గొడవలు సృష్టించి తద్వారా ఎన్నికలకు ఆటంకం కలిగించే పరిస్థితి లేకుండా పటిష్టంగా నిఘా ఉంచాలన్నారు.

ప్రజలకు సేవ చేసే అవకాశం ఇవ్వండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆదాల హిమబిందు

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి ఆ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే అవకాశం ఇవ్వాలని, ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఆదాలను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కుమార్తె ఆదాల హిమబిందు కోరారు. నగరంలోని 37వ డివిజన్‌లో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హిమబిందు మాట్లాడుతూ ఆదాల ప్రభాకర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టినప్పటి కేవలం 9 నెలల్లోనే రూ.150 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, రాష్ట్రంలో మరింత అభివృద్ధి జరగాలన్నా ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసులుయాదవ్, నాయకులు అనిల్, ఆనంద్, వెంకటేశ్వర్లు, గోపి, ప్రసాద్‌రెడ్డి, కొండ్రెడ్డి భరత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కాకుటూరు లక్ష్మీసునంద, పార్టీ నగర ఉపాధ్యక్షుడు వేలూరు శ్రీధర్‌రెడ్డి, ఏపీ స్టేట్ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ తాటిపర్తి వెంకటేశ్వర్లు, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు, హరిత రెడ్డి, భార్గవిరెడ్డి, రోజారాణి, పాశం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్ ఓటరుకు మాత్రమే అందించండి

- రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి సూచనలిస్తున్న ఆర్‌ఓ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ రోజున ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటర్లందరికీ అవగాహన కల్పించాలని, ఓటరు స్లిప్ సంబంధిత ఓటరుకు, వారి రక్తసంబధీకులకు మాత్రమే అందజేయాలని నెల్లూరు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్ బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల తనిఖీల్లో భాగంగా స్థానిక జెండావీధిలోని పీఎస్ఎం హైస్కూల్, మూలాపేటలోని ఈఎస్సార్ఎం హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను సెక్టార్ అధికారులు, అసిస్టెంట్ ఇంజినీర్లు, బూత్‌లెవల్ అధికారులతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ మాట్లాడుతూ ఓటరు స్లిప్‌ల పంపిణీలో ఎలాంటి ఫిర్యాదులకు తావులేకుండా సూపర్‌వైజర్లు, ఎన్నికల సిబ్బంది కృషి చేయాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియకు అధికారులు, సిబ్బంది సిద్ధం కావాలని, పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఓటింగ్ శాతం పెరిగేందుకు కృషి చేయాలన్నారు. తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం మరుగుదొడ్లు, షామియానాలు, బారికేడ్లు, వైద్యశిబిరాల ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం, సీసీ కెమెరాల ఏర్పాటు, ఇంటర్నెట్, ఫ్యాన్లు, ర్యాంపులు, వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్ చైర్స్ తదితర మౌలిక వసతులను కల్పించి ఓటర్లకు అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించాలని ఆర్‌ఓ ఆదేశించారు.

వెంకటేశ్వరస్వామికి లక్ష మల్లెలార్చన



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు, అమ్మవార్లు



లక్ష మల్లెలార్చన పూజల్లో పాల్గొన్న మహిళలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా శుక్రవారం వెంకటేశ్వరస్వామికి లక్ష మల్లెలార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో అక్షయ తృతీయ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సామూహిక లక్ష మల్లెలార్చన పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముత్తైదువులకు పసుపు, గాజులు, సుమంగళి ద్రవ్యాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి చిమటా శేషగిరిరావు – హరిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ప్రధానార్చకుడు సాయిభరద్వాజ, ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఖలీల్‌అహ్మద్

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రజలకు సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని ఆ పార్టీ నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్ కోరారు. నగరంలోని 43వ డివిజన్ దాడివారివీధి, కుమ్మరి వీధి, కంతర్షవలిదర్గావీధి, అప్పడాలవీధి తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఈ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. నెల్లూరు నగర ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ మీరామొహిద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు అతహర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి



నెల్లూరు సిటీ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్‌గుప్తా అన్నారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి గెలుపు కోసం రూరల్ నియోజకవర్గంలోని 33వ డివిజన్‌లో శుక్రవారం నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని, రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 33వ డివిజన్ ఇన్‌చార్జి మేఘనాథ్‌సింగ్, నాయకులు ఖాజామైనుద్దీన్, విజేత, విజయ్‌రాజ్, నిరోషా రావు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో ఇరువురికి గాయాలు



వీధి కుక్కల దాడిలో మహిళ కాలికి తీవ్రగాయాలైన దృశ్యం

నెల్లూరు(బారకాసు): నగరంలోని బాలాజీనగర్ ప్రాంతం కొప్పర్తివారి వీధిలో వీధి కుక్కల దాడిలో ఇరువురు గాయాలపాలైన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. బాలాజీనగర్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ రాత్రి గురువారం 7 గంటల సమయంలో వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా వీధి కుక్కలు ఒక్కసారిగా ఆమెపై దాడి చేశాయి. కుక్కలు ఆమెను కరవడంతోపాటు, గోళ్లతో గీకడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి బాధిత మహిళను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ క్రమంలోనే కొంత సమయం తరువాత మరో మహిళ అదే వీధిలో వెళ్తుండగా ఆమెపై కూడా కుక్కలు దాడి చేశాయి. ఆ మహిళకు స్వల్పగాయాలయ్యాయి. ఈ విషయాన్ని నగరపాలక సంస్థకు చెందిన వెటర్నరీ డాక్టర్ మదన్ మోహన్‌కు తెలియజేయగా శనివారం ఆ వీధిలోని కుక్కలను పట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొప్పుల రాజును గెలిపించండి



మాట్లాడుతున్న యశోధర, దమయంతి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని, ఆ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజును గెలిపించాలని పార్టీ సీనియర్ నాయకురాలు డాక్టర్ యశోధర, కొప్పుల రాజు సతీమణి దమయంతి కోరారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ సిటీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.